

జగనన్నతోనే సుపరిపాలన
జగనన్నతోనే సుపరిపాలన సాధ్యమని, జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారని జెడ్పీ చైర్ పర్సన్ అన్నారు. 8లో



కల్యాణం.. కమనీయం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



ప్రతి గడపకు సంక్షేమం 8లో
సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు చేరాయని ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు చెప్పారు.



విశాఖ వేదిక క్రీడా వేడుక



అందరూ ఆడాలి.. అందరికీ అవకాశమివ్వాలి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి.. గ్రామీణ స్థాయి క్రీడాకారులను సైతం ప్రోత్సహించాలి.. ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. అందుకే సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అంచలంచెలుగా పోటీలు నిర్వహించారు. గల్లీ స్థాయి ఆటగాళ్లు, వెటరన్ క్రీడాకారులు, చిన్నప్పుడెప్పుడో ఆటలాడిన గృహిణులు.. ఇలా ఎందరో ఈ క్రీడా సంబరంలో పాలుపంచుకున్నారు. గ్రామ స్థాయిలో మొదలై, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకొని.. నాలుగు రోజులుగా రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫైనల్స్‌కు విశాఖ వేదికైంది. మంగళవారం విజేతలకు సీఎం చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరగనుంది. క్రికెట్ పోటీ ఫైనల్ మ్యాచ్‌ను ముఖ్యమంత్రి వీక్షించనుండడం ప్రత్యేక ఆకర్షణ.


కబడ్డీలో తలపడుతున్న వైజాగ్,అనంతపురం మహిళా జట్లు

విశాఖ స్పోర్ట్స్: 'ఆడుదాం-ఆంధ్రా' రాష్ట్రస్థాయి టోర్నమెంటు ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్న నేపథ్యంలో కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున ఏర్పాట్లను పరిశీలించారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ తదితర అధికారులతో కలిసి సోమవారం పీఎం పాలెంలోని డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముగింపు కార్యక్రమాన్ని పండగ వాతావరణం తలపించేలా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోందని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు, సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు, శాప్ నుంచి ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. స్టేడియంలోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. స్టేడియం వద్ద సమావేశం అనంతరం జిల్లా అధికారులంతా మధురవాడ ఐటీ హిల్స్ వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖలో రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లు జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులు ఫైనల్ మ్యాచ్‌లో గెలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకునే అదృష్టం కలిగినందుకు చాలా సంతోషపడుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జోనల్ యువజన విభాగం ఇన్‌చార్జి శివ సందీష్ తదితరులు పాల్గొన్నారు.

- నేడు 'ఆడుదాం-ఆంధ్రా' విజేతలకు బహుమతి ప్రదానం
- క్రికెట్ ఫైనల్స్ వీక్షించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- డా.వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు

భారీ బందోబస్తు
విశాఖ సిటీ: ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకల కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖకు వస్తున్న నేపథ్యంలో పోలీస్ శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం 1500 మందితో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటోంది. డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు బందోబస్తును పలు కేటగిరీలుగా విభజించి, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

- ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు, ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టారు.
- ఎయిర్‌పోర్ట్ వద్ద, పార్కింగ్, కాన్వాయ్, హెలిప్యాడ్, క్రికెట్ స్టేడియం వద్ద భద్రత చేపడుతున్న అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు.


ఖోఖోలో తలపడుతున్న బాపట్ల, ప్రకాశం జట్లు

- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు.
- వీఐపీలు పాల్గొనే ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్లతో నిశితంగా తనిఖీలు చేశారు. ఏఎస్సీ, ఆర్‌ఓపీలను నిర్వహిస్తూ సీఎం పర్యటించే రహదారులను పరిశీలించారు.
- ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్యవ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే ఇతరుల వాహనాలకు వేరు వేరుగా పార్కింగ్ స్థలాలు కేటాయించారు.
- ఇప్పటికే సీపీ రవిశంకర్ సీఎం పర్యటించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.
- అనంతరం ఆయన జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-1 మణికంఠ చందోలు, డీసీపీ (క్రైమ్) పి.వెంకటరత్నంలతో కలిసి ఈ బందోబస్తులో విధులు నిర్వహించనున్న అధికారులకు పలు సూచనలు చేశారు.

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా..
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని


విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న విశాల్ గున్ని

సాక్షి, విశాఖపట్నం: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.

తొలి పోస్టింగ్ నర్సీపట్నం ఏఎస్పీగా..
2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్ని శిక్షణానంతరం నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నర్సీపట్నం ఏఎస్పీగా చేసిన ఆయన పదోన్నతిపై ఓఎస్డీగా నియమితులయ్యారు. అనంతరం నెల్లూరు,, తూర్పుగోదావరి జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చారు.

'టాటా ఎలక్ట్రానిక్స్'కు 135 మంది ఎంపిక

ఏఎస్పీ రాహుల్ మీనా


హాజరైన గిరిజన యువతులు


ప్రేరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాహుల్‌మీనా

ఎటపాక: ప్రేరణ ద్వారా కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను ఏజెన్సీలో యువత సద్వినియోగం చేసుకోవాలని చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. తమిళనాడులోని హోసూరు పట్టణంలో టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలమేరకు సోమవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూలకు చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల నుంచి 230 మంది గిరిజన యువతులు హాజరయ్యారు. ఇంటర్ ఆపై చదువుకున్న 135 మంది యువతులు టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ...ఎంపికైన వారు టాటా ఐఫోన్ తయారీ కంపెనీలో పనిచేయనున్నారని, వారికి అన్ని అలవెన్సులు కలిపి రూ.18వేల వేతనం అందుతుందని తెలిపారు. వీరికి పీఎఫ్, మెడికల్, వసతి, భోజన, రవాణా సదుపాయం కల్పిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐలు రామారావు, గజేంద్రకుమార్, ఎస్ఐలు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్,టెన్త్ పరీక్షలు

కలెక్టర్ సుమిత్‌కుమార్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఇంటర్, టెన్త్ పరీక్షలకు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలుశాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి టెన్త్,ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు.

65 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు
వచ్చేనెల 18 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలను జిల్లాలో 65 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. 11,941 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాయనున్నారని, వారిలో 10,986 మంది రెగ్యులర్, 955మంది ప్రైవేట్ విద్యార్థులని తెలిపారు. 65 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 563 మంది ఇన్విజిలేటర్లు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు చెప్పారు. పోలీసుస్టేషన్లలో పరీక్ష పత్రాలను భద్రపరచాలని, ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు.

27 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
మార్చి 1వతేదీ నుంచి జిల్లాలో 27 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 14,611మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. వీరిలో 12,054 మంది రెగ్యులర్ విద్యార్థులు, 2,557మంది ఒకేషనల్ విద్యార్థులున్నారని తెలిపారు. 27మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 610 మంది ఇన్విజిలేటర్లు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు చెప్పారు.పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్, సురక్షిత తాగునీరు, వైద్యసేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

ఎంపీడీవోలు పరీక్షలను పర్యవేక్షించాలని, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలుజేయడంతో పాటు మహిళా పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏఎస్పీ ధీరజ్, పరీక్షల ఏడీ వినయ్ మోహన్‌రావు, ఇంటర్ బోర్డు వృత్తివిద్యా అధికారి అప్పలరాము, డీపీవో కొండలరావు, డీటీవో లీలాప్రసాద్, పాడేరు సీఐ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రెబల్‌గా కచ్చితంగా పోటీ చేస్తా

మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సీవేరి అబ్రహాం


టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న సీవేరి అబ్రహం

అనంతగిరి: టీడీపీ రెబల్ అభ్యర్థిగా కచ్చితంగా పోటీలో ఉంటానని, నా పోటీపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎటువంటి అపోహలు, అపనమ్మకం పెట్టుకోవద్దని మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు సీవేరి అబ్రహం అన్నారు. మండలంలోని ములియగుడ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నా తండ్రి, మాజీ ఎమ్మెల్యే సోమ అహర్నిశలు శ్రమించారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ నుంచి అరకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తానని చంద్రబాబు నన్ను నమ్మించి మోసం చేశారని చెప్పారు. నన్ను నమ్ముకున్న వారికోసం నేను తప్పనిసరిగా పోటీలో ఉండి తీరుతానని, ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అప్పారావు, డొన్ను, సారా సోము, దయానిధి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- 31మందికి రూ.59 లక్షల ఆర్థిక సాయం
- చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయిన ఘటనలో బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంది. గత ఏడాది ఆగస్టు 20న పాడేరు ఘాట్‌రోడ్డులో జరిగిన ఈ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు ప్రయాణికుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం మంజూరు చేశారు. గాయాల పాలైన వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు అప్పట్లో ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు బాధితులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. గాయపడిన 31మందిలో తీవ్రంగా గాయపడి కోలుకున్న ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున, 29 మందికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.59 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేసి, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్, పాడేరు ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలతో పాటు గాయపడిన వారికి ఆర్థిక సాయం అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీపీ సొనారి రత్నకుమారి, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, వెలుగు ఏపీడీ మురళీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, వైఎస్సార్‌సీపీ పాడేరు,చింతపల్లి మండలాల అధ్యక్షులు సీదరి రాంబాబు,మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

కలప వేలంతో రూ.3.81 లక్షల ఆదాయం


సబ్ డీఎఫ్‌వో బెర్నడ్ రాజు


డిపోలో ఉన్న కలప

కొయ్యూరు: మండలంలోని సింగవరం ఐటీడీఏ కాలనీలో ఏర్పాటు చేసిన కాకరపాడు డిపోలో కలపను మొదటిసారిగా సోమవారం వేలం వేశారు. వేలం పాటలో మొత్తం రూ.35 లక్షలు వస్తాయని అధికారులు భావించారు. అయితే గంధ్రతో పాటు మరో రకం చెట్ల కలపను మాత్రమే రూ.3.81 లక్షలకు వ్యాపారులు వేలంలో పాడుకున్నారు. నల్లమద్ది సహా మరి కొన్ని మారుజాతి చెట్ల కలపను పాడుకునేందుకు వ్యాపారులు విముఖత చూపారు. చింతపల్లి సబ్ డీఎఫ్‌వో బెర్నడ్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో నలుగురు వ్యాపారులు పాల్గొన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో కొట్టిన చెట్లదుంగలను ఇక్కడ డిపోలో ఉంచారు. అలా ఉంచిన కలపను వేలం వేశారు. దాదాపు రూ.కోటి విలువ చేసే కలపను ఇక్కడ నిల్వ చేశారు. వేలం వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించి మరోసారి పాట నిర్వహిస్తామని సబ్ డీఎఫ్‌వో రాజు తెలిపారు. పెదవలస రేంజర్ జగదీష్, కొయ్యూరు ఎఫ్ఎస్‌వో సింహాద్రి, అటవీశాఖ ఉద్యోగి దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత


మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసినట్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సీలేరు, డొంకరాయి, మోతుగూడెం జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామని చెప్పారు. సీలేరులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీటిని నిలుపుదల చేస్తేనే పోలవరం డ్యాం గేట్ల పరిశీలన సాధ్యమవుతుందని చెప్పారు. నేపథ్యంలో అక్కడ నీటిమట్టాలు పెరగకుండా ఉండేందుకు విద్యుత్ ఉత్పత్తి ఆపివేసి, నీటిని నిలిపివేయాలని ఇరిగేషన్ అధికారులు కోరారన్నారు. దీంతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామన్నారు.


వంతాడపల్లి తోటలు ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

వణికిస్తున్న చలిగాలులు
సాక్షి,పాడేరు: శీతాకాలం చివరిలోను జిల్లాలో చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదివారం 17.2 డిగ్రీలు నమోదవగా, సోమవారం ఉదయం ఒక్కసారిగా తగ్గి 12 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అరకులోయలో 15.5 డిగ్రీలు, మినుములూరులో 16 డిగ్రీలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలులు వీచాయి.

జీపు బోల్తా.. ఇద్దరు గిరిజనుల మృతి

- ఏడుగురికి తీవ్రగాయాలు
- భీమనపల్లి సమీపంలో వంతెన వద్ద ఘటన
- సంతకు వెళ్లి వస్తుండగా ప్రమాదం


ప్రమాదానికి గురైన జీపు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి


చికిత్స పొందుతున్న బాధితుడు

చింతపల్లి రూరల్: మండలంలోని భీమనపల్లి సమీపంలో వంతెన వద్ద జీపు బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం జరిగిన సంతకు వెళ్లిన కుడుమసారి పంచాయతీ శివారు సంపంగిపుట్టు, భీమనపల్లి, మెరకల్, తమ్మంగుల పంచాయతీ దోనిపాలాల గ్రామాలకు చెందిన 11 మంది తిరుగు ప్రయాణంలో సాయంత్రం టిక్కెట్ సర్వీస్ జీపు ఎక్కారు. జీపు భీమనపల్లి సమీపంలో వంతెన వద్దకు చేరుకునే సరికి బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో వాహనం అదుపుతప్పి వంతెన దిమ్మను ఢీకొని బోల్తా పడింది. ప్రమాద సమయంలో డ్రైవర్‌తో సహా 12 మంది జీపులో ఉన్నారు. జీపు కింద చిక్కుకున్న మెరకల్ గ్రామానికి చెందిన జర్తా చిన్నమ్మి(60) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన 11 మందిని లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం.. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని పాడేరు ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లో ఎక్కిస్తుండగా మెరకల్ గ్రామానికే చెందిన వంతల అప్పారావు (45) మృతి చెందాడు. మిగతా వారిని పాడేరు ఆస్పత్రికి తరలించినట్టు లోతుగెడ్డ పీహెచ్‌సీ వైద్యుడు లక్ష్మీకాంతం తెలిపారు. క్షతగాత్రులకు వైఎస్సార్‌సీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి సహకారం అందించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఫోన్‌లో పరామర్శించి, మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులను కోరారు.

జగనన్నతోనే సుపరిపాలన సాధ్యం

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో జగనన్నతోనే సుపరిపాలన సాధ్యమని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారని విశాఖ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, సమన్వయకర్తలు మత్స్యలింగం, భాగ్యలక్ష్మి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అరకు అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలైన రేగం మత్స్యలింగం, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలకు మండల వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పలు ఆలయాల దర్శనం అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. జగనన్నను ముఖ్యమంత్రి చేసేందుకు మేమంతా సిద్ధం అంటూ నేతలు,కార్యకర్తలు నినాదాలు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ నిత్యం పేదల కోసం పరితపిస్తున్న సీఎం జగనన్నను గెలిపించుకుందామన్నారు. అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అరకు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, మరోసారి ఎమ్మెల్యే,ఎంపీలను గెలిపించుకొని జగనన్నను గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. అరకు పార్లమెంట్ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో గిరిజనుల పరిస్థితులను గమనించి అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ,వైస్ఎంపీపీ భాగ్యవతి,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ జగబంధు,జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రమేష్,సర్పంచులు,ఎంపీటీసీలు,మండల నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తలు మత్స్యలింగం, భాగ్యలక్ష్మిలు

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మోతుగూడెం: మోతుగూడెం పరిధిలోని మల్లరం గ్రామంలో ఎం.రామసుందరం (30) ఆదివారం రాత్రి జీలుగుకల్లు తీయడానికి వెళ్లాడు. జీలుగు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. భర్త తెల్లవారు అయినా ఇంటికి రాకపోవడంతో భార్య గురహరి గ్రామంలోని తోట దగ్గరికి వెళ్లింది. సమీపంలోని జీలుగుచెట్టు కింద రామ సుందర్ పడిపోయి ఉండడాన్ని గమినించింది. విషయాన్ని గ్రామస్తులకు తెలియజేసింది. అప్పటికే రామసుందరం మృతి చెందినట్టు వారు గుర్తించారు. విషయాన్ని తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరకున్నారు. ఎస్ఐ గోపాల్‌రావు కేసు నమోదు చేశారు. చింతూరు ప్రభుత్వ ఆస్పత్రికి రామసుందరం మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించారు.

పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ఓటర్ల జాబితలకు సంభందించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అధికారులతో ఎన్నికల ప్రక్రియపై తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6,7,8లపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సమస్యలుంటే త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించలేదని అన్ని రాజకీయ పార్టీలకు తగిన సమాచారం ఇవ్వాలన్నారు. 1056 ఫారం ఆరు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయిని, చింతపల్లి, జి.మాడుగుల, రంపచోడవరం బీఎల్‌వోలు లాగిన్ అయి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఫారం -7కు సంబంధించి పాడేరు, రాజవొమ్మంగి, ఫారం -8కు సంబంధించి చింతూరు, మారెడుమిల్లి, వై.రామవరం తహసీల్దార్లు పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. వారం రోజులకు మించి బీఎల్‌వో లాగిన్‌లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఎంపీడీవోలంతా తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల సిబ్బంది నివాసాలను గుర్తించాలన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన ప్రాంతాల్లోనే పోలింగ్ సిబ్బంది ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు సెలవులను ఐటీడీఏ పీవోల ద్వారా పొందాలని, జెడ్పీ సీఈవోలకు సెలవులు మంజూరుకు వీలులేదన్నారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, చైతన్య తదితరులున్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు నాగిరెడ్డి ఎంపిక



ఎటపాక: త్వరలో జరుగనున్న వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎటపాక మండలంలోని నల్లకుంట ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.నాగిరెడ్డి ఎంపికయ్యారు. ఈనెల 8నుంచి 11వరకు ఐదవ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ పోటీలు హైదరాబాదులోని గజిబౌలి స్టేడియంలో జరిగాయి. ఈపోటీల్లో 45 సంవత్సరాల విభాగంలో షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్, జావలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించి త్వరలో జరుగనున్న వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్టు నాగిరెడ్డి తెలిపారు.ఏ దేశంలో పోటీలు జరుగనున్నాయో త్వరలో ప్రకటించనున్నారు. నాగిరెడ్డిని తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరు వ్యక్తులకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.22వేల జరిమానా విధిస్తూ నగరంలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం-1 న్యాయమూర్తి సీఎస్‌మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. వివరాలివీ.. మొదటి నిందితుడు సత్య శివరామ శర్మ రాజమహేంద్రవరం గ్రామీణంలోని ధవళేశ్వరం సిండికేట్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసేవాడు. మూడవ నిందితుడు మెండ వెంకట రమణమూర్తి ధవళేశ్వరంలోని స్వర్ణాంధ్ర పేపర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమానిగా ఉన్నారు. ఐదవ నిందితుడు చిన్నిమల్లి సూర్య ప్రభాకర్‌రావు రాజమండ్రి సమీపంలోని కొంతమూరులో శ్రీ సాయి పేపర్ ఎక్యూప్‌మెంట్ అండ్ స్పేర్స్ యజమాని. 2012-2013 ప్రాంతంలో నిందితులందరూ ఏకమై 30 టీపీడీ మోడల్ మిషన్ కొనుగోలుకు బ్యాంక్ రుణం కోసం సిండికేట్ బ్యాంక్‌ను ఆశ్రయించారు. తమకు 9 కోట్ల 88 లక్షల 12 వేల 136 రూపాయలు కావాలని బ్యాంక్‌లో దరఖాస్తు చేసుకున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, ఆడిట్ రిపోర్టులను బ్యాంక్‌కి సమర్పించారు. నివేదికలను సమగ్రంగా పరిశీలించకుండా అప్పటి బ్యాంక్ సీనియర్ మేనేజర్ శర్మ వీరికి రుణాలు మంజూరు చేశారు. దీంతో వారు రూ.6కోట్ల వరకు రుణాలు పొందారు. తర్వాత బ్యాంక్ పైఅధికారులకు అనుమానం రావడంతో నిందితులు, వారి కంపెనీలకు సంబంధించిన వివరాలను సేకరించారు. అన్ని నకిలీవి అని తేలడంతో బ్యాంక్ మేనేజర్‌తో పాటు కంపెనీ యజమానులపై కేసు నమోదు చేశారు. నిందితులపై ఐపీసీ 420, 120 బి, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 బి, సెక్షన్లపై కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా మొదటి నిందితుడు శర్మ 2019 మేలో మృతి చెందారు. కీలకమైన నిందితులు వెంకట రమణమూర్తి, సూర్య ప్రభాకర్ రావులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. ఎ-2 ఆస్తి మదింపు చేసిన వ్యక్తి, ఏ-4 ఆడిటర్ నిర్దోషులుగా తేలారు. బ్యాంక్‌లను మోసగించినా.. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో లంచం తీసుకున్నా.. అవినీతికి పాల్పడిన వారికి సంబంధించి తమకు తెలియజేయాలని సీబీఐ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీ బుధవారం నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.పోలినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల జిల్లా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు.

హెచ్‌ఎస్‌ఎల్‌లో వీఎల్‌టీ ప్యానెల్ పునరుద్ధరణ

డీచ్‌రోడ్డు: జాతీయ ఉత్పాదకత దినోత్సవం సందర్భంగా హిందూస్థాన్ షిప్‌యార్డ్(హెచ్‌ఎస్‌ఎల్)లో 30 ఏళ్ల నాటి 440 వీఎల్‌టీ ప్యానెల్‌ను పునరుద్ధరించారు. యార్డ్ ఆధునికీకరణ ప్రణాళికలో భాగంగా సోమవారం షిప్‌యార్డ్ సీఎండీ కమోడోర్ హేమంత్ ఖత్రి దీనిని ప్రారంభించారు. ఈ ప్యానెల్ ద్వారా ఉత్పత్తిలో అంతరాయం లేకుండా చేయవచ్చని ఆయన తెలిపారు. ప్యానెల్ పునరుద్ధరించడం ద్వారా హెచ్‌సీఎల్ ఉద్యోగుల్లో విశ్వాసం పెరిగిందన్నారు.

ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే సహించం

- డ్వామా పీడీ శివయ్య
- ముంచంగిపుట్టులో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక
- రూ.3,15,631లు రికవరీకి ఆదేశం

ముంచంగిపుట్టు: వేతనాదరులకు ఉపాధి కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని డ్వామా పీడీ శివయ్య అన్నారు. మండలంలో 23 పంచాయతీలోఉపాధి హామీ పథకం కింద 2022 సంవత్సరం ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ వరకు జరిగిన పనులపై సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యలయ ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ శివయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మండలంలో రూ.28,78,54,948లతో చేసిన పలు పనులపై సమీక్ష నిర్వహించారు. గత నెల 20 నుంచి ఈ నెల 11 తేదీ వరకు గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు పనులపై తనిఖీలు చేసి, గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో గుర్తించిన ఉపాధి పనుల అక్రమాలపై ప్రజావేదికలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజల సమక్షంలో చర్చించారు.ఉపాధి హామీ, సమగ్ర శిక్ష అభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఐటీడీఏ శాఖాల ద్వారా జరిగిన పనులపై ప్రజావేదికలో చర్చలు జరిగాయి. ఉపాధి పనులకు బిల్లులు చెల్లింపులపై అధికారులను ప్రజలు ఫిర్యారు చేసి ప్రశ్నించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ శివయ్య మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ పనులు చేయాలని, పనుల కల్పనలో సిబ్బంది ఎటువంటి ఆలసత్యం ప్రదర్శించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి సిబ్బంది అంతా రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మండలంలో వివిధ పనుల్లో జరిగిన తేడాలపై రూ.3,15,631లు రికవరీ చేయనున్నట్టు, రూ.51వేలు ఫైన్ వేశామన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలదేవి, ఏపీడీ గిరిబాబు, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏపీవో సంగంనాయుడు, డీఆర్‌పీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వీఆర్‌పీలు, అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

ఒంటరితనంతో మనస్తాపం

వివాహిత బలవన్మరణం

మల్కాపురం: భర్త, పిల్లలు లేరన్న మనస్తాపంతో వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్ సమీపంలోని అంబేడ్కర్‌కాలనీలో కంకిపాడు ఝాన్సీ (32) నివాసం ఉంటోంది. పిల్లలు లేకపోవడంతో కొంతకాలంగా తీవ్ర ఆవేదనతో ఉంది. ఇటీవలే ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. ఒంటరిగా ఇంట్లో దిగాలుగా ఉండేది. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాత్‌రూమ్‌లో హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తర్వాత ఝాన్సీ ఇంటికి వచ్చిన బంధువులు.. ఆమెను పిలిచారు. ఎంతకీ స్పందన లేకపోవడంతో గదిలో వెతికారు. గడియ పెట్టి ఉన్న బాత్‌రూమ్ డోర్‌ను కొట్టారు. ఫలితం లేకపోవడంతో అనుమానం వచ్చి మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని.. బాత్‌రూమ్ తెరిచి చూశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మనస్తాపమే ఆ మృతికి కారణం అని విచారణ అనంతరం పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అటవీ సంపద అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

వై.రామవరం: అటవీ సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీపీ కడబాల ఆనందరావు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అటవీ ప్రాంతం నుంచి వ్యాపారులు అక్రమంగా కలప రవాణా చేస్తున్నారన్నారు. దీంతో అటవీ సంపదకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. సమీప గ్రామాల్లో అటవీ ప్రాంతాల్లో పొక్లెయిన్‌లతో మామిడి, టేకు, వేప తదితర భారీ వృక్షాలను నరికి కలపను అక్రమంగా లారీల్లో తరలిస్తున్నారన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అటవీ సంపద అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ విషయంపై అడ్డతీగల రేంజి అధికారి సయ్యద్ సహెన్‌షాను వివరణ కోరగా ప్రస్తుతం కలప అక్రమ రవాణాను నిలుపుదల చేశామన్నారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి

అనంతగిరి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. మండలంలోని కొండిబ పంచాయతీ తైడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులందరికీ టెక్‌హోమ్ రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రీ స్కూల్ పిల్లలు ప్రతిరోజు కేంద్రానికి వచ్చేలా చూడాలని, నులిపురుగు నివారణలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయాలన్నారు. సీడీపీవో సంతోషికుమారి తదితరులున్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ఫార్మసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలో పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్టుల గ్రేడ్-2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ, జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి ,విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మసిస్టు గ్రేడ్-2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తులు స్వీకరించనున్న ట్టు ఆమె తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను రేసవానిపాలెంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇంటర్ అర్హతతోపాటు డి.ఫార్మా/ బి.ఫార్మా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాల కోసం https@// nagendrasvast.wordpress.com వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300,డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం పేరిట డీడీ తీయాలని డాక్టర్ సుజాత తెలియజేశారు.

అంతర్జాతీయ వర్సిటీలకు దీటుగా ఏయూ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఏయూ పూర్వ విద్యార్థి, అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్ తల్లాప్రగడ సందర్శించారు. ఏయూలో జరుగుతున్న పరిశోధనలు పరిశీలించారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయ్ తల్లాప్రగడ మాట్లాడుతూ వర్సిటీ సాధించిన ప్రగతి పట్ల సంతోషం, సంతృప్తిని వ్యక్తం చేస్తున్నానన్నారు. అమెరికాలోని అత్యున్నత విశ్వవిద్యాలయాలైన ఎంఐటీ, హార్వర్డ్ వర్సిటీల తరహాలో ఏయూ అభివృద్ధి సాధిస్తోందన్నారు. వర్సిటీకి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. అతన్ని వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు. ఆచార్య పి.సునీత, రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.



డాక్టర్ విజయ్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కాశీ రైలు దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధి అన్‌కోరా-సోన్ నగర్ మధ్య నిర్మిస్తున్న 3వ లైన్ సంబంధిత ప్రీ/నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా.. ఈ మార్గంలో ప్రయాణించే విశాఖపట్నం -బనారస్-విశాఖపట్నం రైలును దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 18, 21 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం -బనారస్(18311) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 15, 19, 22వ తేదీల్లో బయలుదేరే బనారస్-విశాఖపట్నం(18312) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ బర్కకానా-గార్వా రోడ్-డెహ్రీ ఆన్‌సోన్-పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గంలో ప్రయాణించదు. మళ్లించిన మార్గంలో వయా బర్కకానా-హజారీబాగ్ టౌన్-కోడెర్మా-గయ- పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్ల మీదుగా నడుస్తుంది. విశాఖపట్నం-తిరుపతి(08583) స్పెషల్ ఆలస్యంగా సోమవారం రాత్రి 10.10 గంటలకు బయలుదేరింది. ఈ రైలు రాత్రి 7.10 గంటలకు ప్రయాణించాల్సి ఉండగా.. పెయిరింగ్ రైలు రాక ఆలస్యమైంది.

ప్రతి గడపకు సంక్షేమం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- రంపచోడవరంలో రోడ్‌షో



ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీలనంత్‌బాబులకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు)లు అన్నారు. రంపచోడవరం మండలంలో సోమవారం రోడ్‌షో నిర్వహించారు. బి.వెలమలకోట వద్ద రోడ్‌షో ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారీ ర్యాలీతో రోడ్‌షో ప్రారంభమైంది. ఐ.పోలవరం, జాగరంపల్లి, బందపల్లి, వాడపల్లి,బోలగొండ వరకు రోడ్‌షో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత్‌బాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే మన్య ప్రాంత అభివృద్ధి జరిగిందన్నారు. ఏళ్ల తరబడి నిలిచిపోయిన పందిరిమామిడి-చవిటిదిబ్బలు రోడ్డుతో పాటు అనేక రోడ్డులకు అనుమతులు వచ్చాయన్నారు. గిరిజనుల పోడు భూములకు హక్కులు కల్పించి , రైతు భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏజెన్సీలో 40వేల ఎకరాల పోడు భూములకు అటవీ హక్కుల చట్టంలో పట్టాలు కల్పించినట్టు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు.ఏజెన్సీలో ఎన్నడూ లేని విధంగా అర్హులందరికీ పొజిషన్ సర్టిఫికెట్‌లు, గృహాల నిర్మాణాలకు స్థలాలు కేటాయించారన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, కొత్త పీహెచ్‌సీల నిర్మాణం జరిగిందన్నారు. రంపచోడవరంలో మల్టీ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గిరిజనాభివృద్ధిలో జగనన్న ప్రభుత్వం తనదైన ముద్రవేసిందన్నారు. గిరిజనులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా కోరుకుంటున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఫించన్ రూ. 3వేలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రెవెన్యూ సేవలను గ్రామస్థాయిలోకి తీసుకువచ్చారని తెలిపారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు మల్లిన బాబికి పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు

వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఐ.పోలవరం పంచాయతీ టీడీపీ వార్డు మెంబరు మల్లిన బాబి, స్థానిక ఎంపీపీ బందం శ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అనంతబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఇతనికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయం కోసం పనిచేస్తానని బాబి చెప్పారు.మరికొంత మంది టీడీపీ క్యాడర్ పార్టీలో చేరనున్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.